క్లుప్తంగా

నేడు సామూహిక అభిషేకాలు

సంతనూతలపాడు: మండల కేంద్రంలో వేంచేసి ఉన్న శ్రీ త్రిపురాంతక స్వామి వారి దేవస్థానంలో కార్తీక మాసం చివరి పర్వదినం మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం సామూహికంగా అభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరుగుతాయన్నారు. 9 గంటలకు మంత్ర పుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని అలాగే 11 గంటల నుంచి అన్నదానం ప్రారంభమవుతుందని తెలిపారు.

20 మద్యం సీసాలు స్వాధీనం



దాడిలో పట్టుబడిన మద్యం సీసాలతో ఎస్సై

నాగులుప్పలపాడు: అక్రమంగా మద్యం నిల్వ చేయడంతో పాటు గుట్టుగా మద్యం అమ్మకాలు జరుపుతున్న వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఆయన సమాచారం మేరకు.. మండలంలోని పోతవరం గ్రామంలో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న యరజన మోహన రావు దుకాణంపై దాడి చేశారు. అతని వద్ద 20 మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు చెప్పారు.

ప్రమాణాలు పాటించకపోతే చర్యలు

మద్దిపాడు: ప్రతి రేషన్ డీలర్ షాపులో రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రమాణాలను తప్పక పాటించాలని తహసీల్దార్ యం. సుజన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలో ఆయా గ్రామాల రేషన్ డీలర్ సమావేశం నిర్వహించారు. ప్రజా పంపిణీ కార్యక్రమంలో భాగంగా రేషన్ డీలర్లు, పంపిణీలో వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అధికారుల స్పందించి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ కుమార్, తసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి


ఉపన్యాస పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: భారత రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జయ ప్రకాశ్ అన్నారు. రాజ్యాంగ వజ్రోత్సవాలను పురస్కరించుకొని ఓ ప్రైవేటు పబ్లిక్ స్కూలులో రాజ్యాంగ వారోత్సవాల్లో భాగంగా భారత రాజ్యాంగంపై ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగానికి ప్రవేశిక కీలకమైనదని చెప్పారు. భారత రాజ్యాంగంలో ప్రజా స్వామ్యము, లౌకికతత్వం, సమాఖ్య విధానం, సమానత్వం ముఖ్యమైనవని జేవీవీ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ రంగారెడ్డి, ఎన్‌టీ వెంకటేష్ చెప్పారు. స్కూలు ప్రిన్సిపాల్ విష్ణు మాట్లాడుతూ... రాజ్యాంగంలో పేర్కొన్న పౌరుల ప్రాథమిక హక్కులు, విధుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులతో చేత రాజ్యాంగ పీఠికను చదివించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు సూచనలిస్తున్న సీఐ మల్లికార్జున

కంభం: విద్యార్థులు చదువుకునే వయసులో గంజాయి, మద్యం, ఇతర వ్యసనాల జోలికి వెళ్లకూడదని కంభం సీఐ కె.మల్లికార్జునరావు హితబోధ చేశారు. స్థానిక వాసవి జూనియర్ కళాశాలలో గురువారం సాయంత్రం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమాజంలో విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్‌ను చేతులారా నాశనం చేసుకుంటున్నారన్నారు. ఆడపిల్లలకు బాల్య వివాహం చేయకుండా చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, ప్రిన్సిపాళ్లు కె.రాము, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి జాడ ఎక్కడ?


మర్రిచెట్లపాలెం మద్యం దుకాణం దగ్గర వాహన నదారుల తిప్పలు (ఫైల్)


మర్రిచెట్లపాలెం, అయ్యపరాజుపాలెం మధ్య రహదారి గోతులమయం (ఫైల్)

- చీమకుర్తి మండలానికి కష్టాలు
- మండల పాలక వర్గం, అధికారపక్షం మధ్య సమన్వయ లోపం
- గత ప్రభుత్వ హయాంలో పరిగెత్తిన అభివృద్ధి

చీమకుర్తి రూరల్: మండల అభివృద్ధి పడకేసింది. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేయించుకే క్రమంలో అధికార పక్షం నాయకులు విఫలం అయ్యారు. పక్క మండలాల్లో కొంత మేర అభివృద్ధి పనులు జరుగుతూ ఉండగా.. చీమకుర్తి మండలాన్ని పట్టించుకేవారు కానరవడంలేదు. పంచాయతీల్లో సమస్యలు తిష్ట వేశాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యం

మండల పాలక వర్గం, అధికార పక్షం మధ్య సమన్వయ లోపం వలన అభివృద్ధి కుంటుపడింది. గతంలో వైఎస్సార్ సీపీ నాయకులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి ఎంబుక్ రికార్డింగ్, ఇంజినీరింగ్ పనులు పెండింగ్‌లో ఉండటం వలన, అసంపూర్తిగా పనులు మిగిలాయి. ఇది నేటి ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. అధికారం వచ్చే ఐదు నెలలు గడుస్తున్నా ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు.

గత ప్రభుత్వ హయాంలో తారు రోడ్లు

మండల ప్రజా పరిషత్ నిధులు రూ. 15 కోట్లతో గ్రామాలను కలిపే తారు రోడ్ల నిర్మాణ పనులను గత ప్రభుత్వం నాణ్యవంతంగా చేసింది. సాధారణంగా మండల పరిషత్ వర్క్ మూడు లక్షలకే పరిమితం.. జిల్లా పరిషత్ వర్క్ అయితే ఐదు లక్షలకు వరకు ఉంటుంది. దీంతో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ప్రస్తుతం దర్శి ఎంఎల్‌ఏ బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి చొరవతో టెక్నికల్ శాంక్షన్, వర్క్ ఆర్డర్ త్వరగా తెప్పించి తారు రోడ్డు నిర్మాణాలకు కృషి చేశారు.

నాటి ప్రభుత్వంలో చేసిన పనులు ఇవే..

బండ్లమూడి నుంచి పడమటి నాయుడుపాలెం వరకు, తొర్రగుడిపాడు నుంచి నేకునంబాదు, గాడి పర్తి వారి పాలెం నుంచి ఇలపావులూరు.. పాండురంగపురం నుంచి పల్లామల్లి కొండ.. అగ్రహారం అడ్డరోడ్డు నుంచి పడమటి నాయుడు పాలెం మీదుగా పాటిమీద పాలెం దగ్గర కలిసే గంగవరం అడ్డ రోడ్డు వరకు.. దేవరపాలెం నుంచి ఊబచెత్త పాలెం.. చిన్న రావిపాడు నుంచి ముప్పవారిపాలెం వరకు (ఆర్అండ్బీ అనుమతితో).. ఏలూరు వారి పాలెం నుంచి కొనగాని వారి పాలెం.. గుడిపూడి వారి పాలెం ఎస్సీ కాలనీ నుంచి మర్రిపాలెం చిన్న రావిపాడు కనెక్టివిటీ రోడ్డు వరకు.. ఎల్లయ్య నగర్ నుంచి బూదవాడ వరకు మండల ప్రజా పరిషత్ నిధులతో నాణ్యతతో నిర్మించారు.

40 సంవత్సరాల ప్రజల కల ఆ బ్రిడ్జి నిర్మాణం..

గుండువారి లక్ష్మీపురం నుంచి రామచంద్రపురం వెళ్లే మార్గమధ్యంలో ఆర్అంబీ అనుమతితో మండల పరిషత్ నిధులతో రూ. 60 లక్షలతో వంతెన నిర్మించారు. ఆ రెండు గ్రామాల ప్రజల 40 సంవత్సరాల ఆకాంక్షను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీర్చింది. ఇలా వారి కష్టాలు తీరాయి.

గోతుల మయం

మండలంలోని మర్రి చెట్లపాలెం ప్రధాన రహదారి కూడలి నుంచి తాళ్లూరు మండలం బొద్దికూరపాడు వరకు ఉన్న రహదారి గోతులమయంగా మారింది. నయా పారిశ్రామిక వాడగా రూపుదిద్దుకుంటున్న మర్రిచెట్లపాలెం కూడలి నుంచి మర్రిచెట్లపాలెం, అయ్యపరాజుపాలెం, నిప్పట్లపాడు, బక్కిరెడ్డిపాలెం, దేవరపాలెం మీదుగా బొద్దికూరపాడు వరకు ఆర్ అండ్‌బీ రహదారిలో ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో వెలసిన గ్రానైట్ పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో చిన్న గోతులు కాస్తా.. వర్షం పడినప్పుడు భారీ గుంతలుగా మారడంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించాలంటేనే వాహనదారులు హడలి పోతున్నారు.

వంతెన లేకపోతే ఇబ్బందే..


గుండువారి లక్ష్మీపురం నుంచి రామచంద్రపురం వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మించారు. గతంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతూ చప్టా దాటేవారు. ఇప్పుడు బాగుంది.

– నల్లూరి రామచంద్రరావు, గుండువారి లక్ష్మీపురం

నాడు తారు రోడ్డు వేయడం ఉపయోగకరంగా ఉంది


బండ్లమూడి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నాయుడుపాలెం, అగ్రహారం నుంచి విద్యార్థులు మట్టి రోడ్డులో వస్తూ ఉండేవారు. ఇప్పుడు బండ్లమూడి నుంచి పడమటి నాయుడుపాలెం తారు రోడ్డు వేయడంతో వర్షాకాలం అయినా ఇబ్బంది లేదు.

– యానం శేషురెడ్డి, బండ్లమూడి మాజీ సర్పంచ్

గమనించిన మండల నాయకులు


స్థానికంగా గ్రానైట్ ఫ్యాక్టరీలు అధికంగా ఉండటం వలన లారీలు తిరుగుతుంటాయి. ఇది గమనించిన నాయకులు ఎల్లయ్య నగర్ నుంచి బూదవాడ వరకు తారు రోడ్డు మండల పరిషత్ నిధులతో నిర్మించారు.

–జంద్రాజుపల్లి మరియమ్మ, బూదవాడ సర్పంచ్

మహిళా విద్యకు మార్గదర్శకుడు పూలే

ఒంగోలు టౌన్: దేశంలో మహిళల కోసం తొలి పాఠశాలను ఏర్పాటు చేసి మహిళా విద్యకు మార్గదర్శకుడిగా నిలిచిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆలోచనలు నేటి తరాలకు ఆదర్శనీయమని జిల్లా గ్రంథాలయల కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి ఆ తరువాత అనేక రంగాలకు విస్తరించిందని కొనియాడారు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం , అంటరానితనాన్ని పారదోలేందుకు భార్య సావిత్రి బాయి పూలేతో కలిసి అహర్నిశలు పాటుపడ్డారని, ఈ క్రమంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నారని చెప్పారు. దోపిడి, అణచివేతలకు విద్య లేకపోవడమే ప్రధాన కారణమని గుర్తించిన తన జీవితాంతం నిరుపేదలకు చదువు చెప్పేందుకు పాటుపడ్డారని చెప్పారు. తొలుత పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాయల ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కె. సంపూర్ణమ్మ, కృష్ణవేణి, అనిల్ బాబు, మృదుల్ కుమార్, ఇమ్మానియేలు, పాఠకులు పాల్గొన్నారు.


ఒంగోలు టౌన్: జిల్లా గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న జిల్లా కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

చీమకుర్తి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా బీసీ సంఘాల నాయకులు, మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పూలే జయంతి పురస్కరించుకొని గురువారం చీమకుర్తిలోని పోలీస్ స్టేషన్ వద్దనున్న ఆయన విగ్రహానికి బీసీ సంఘాల నాయకులు మర్రి లక్ష్మీనారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్రపు రాఘవ, చల్లా శ్రీనివాస్, పిన్నిక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇదే విగ్రహానికి స్థానిక కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్యతో పాటు స్థానిక నాయకులు నివాళులర్పించారు. చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్‌లు బీమన వెంకట్రావు, సోమా శేషాద్రి, తప్పెట బాబూరావు, ఖాజా, కమిషనర్ వై.రామకృష్ణయ్య, ఆఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో నివాళులర్పించారు.


చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు


చీమకుర్తి మున్సిపాలిటీలో నివాళులర్పిస్తున్న కౌన్సిలర్‌లు, కమిషనర్, సిబ్బంది

అయ్యప్పకు ఘన పూజలు


కొత్తపట్నం బస్టాండ్ శివాలయం దగ్గర అఖండ పడి భజనలో మాలధారులు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు మర్రి చెట్టు పొలిమేర అభయాంజనేయ స్వామి దేవస్థానం దగ్గర, ఒంగోలు కొత్త పట్నం బస్టాండు శివాలయం దగ్గర, అఖండ పడిపూజ వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి పొలిమేర అభయాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రముఖ వేద పురోహితులు పరాంకుశం రంగస్వామి హరిహర పుత్ర అయ్యప్ప స్వామికి అఖండ పడిపూజ వైభవంగా నిర్వహించారు. భజన కార్యక్రమంలో పాల్గొని స్వాములు తీర్థప్రసాదాలు అల్పాహారాన్ని స్వీకరించారు.

చీమకుర్తి రూరల్: మంచికలపాడు పంచాయతీ పరిధిలోని రెడ్డి నగర్ లో కొండ్రాజు కోటేశ్వరరావు స్వగృహంలో గురువారం అయ్యప్ప స్వామి అరటి మండప పడిపూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలలు ధరించిన స్వాములందరూ పాల్గొని భక్తి పారవశ్యంతో అయ్యప్ప స్వామి గీతాలను ఆలపించారు. అనంతరం సర్వమాల ధారణ స్వాములకు భక్తులకు ఫలహారం ఏర్పాటు చేశారు.


చీమకుర్తి : పడిపూజా కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు

1న గంగమ్మ, గౌరమ్మ నిమజ్జనం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నెల రోజులపాటు పూజలందుకున్న గంగమ్మ, గౌరమ్మను కె.ఎస్.పల్లె సమీపంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయం వద్ద సగిలేరులో డిసెంబర్ 1న నిమజ్జనం చేయనున్నట్లు కమిటీ అధ్యక్షుడు నరసింహులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆధార్ కేంద్రంలో అధిక వసూళ్లపై ఫిర్యాదు

కంభం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న సీఎస్సీ సెంటర్, ఆధార్ కేంద్రంలో ప్రజల నుంచి అధిక మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మార్పీఎస్ నాయకుడు నేదరపల్లి జయరాజ్ గురువారం ఎంపీడీఓ వీరభద్రాచారికి ఫిర్యాదు చేశారు. అర్బన్ కాలనీకి చెందిన పి.చంద్రరాజు అనే విద్యార్థి సీఎస్సీ సెంటర్ వద్దకు వెళ్లగా బర్త్ సర్టిఫికెట్‌కు రూ.10 వేలు డిమాండ్ చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బర్త్ సర్టిఫికెట్ కోసం మీ సేవ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని, సీఎస్సీ సెంటర్‌లో ఆ సేవలు ఉండవని, అడిగినంత డబ్బు ఇస్తే సర్టిఫికెట్ ఇప్పిస్తాననడంపై విచారణ చేపట్టాలని కోరారు.

మురుగుమయంగా మంచినీటి సంపు



పొదిలి: స్థానిక చిన్న బస్టాండ్ నుంచి దాసరిగడ్డకు వెళ్లే రోడ్డులో మంచి నీటి సంపు మురుగుమయంగా మారింది. సంపు పైకప్పు లేకపోవడంతో నీరు, చెత్తాచెదారం చేరి దుర్వాసన వస్తోంది. నీరు కూడా కలుషితమై వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంపు వాహనాల రాకపోకలకు కూడా సమస్యగా మారింది. అధికారులు స్పందించి సంపు శుభ్రం చేయించడంతోపాటు పైకప్పు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా సాయి ఆలయ వార్షికోత్సవం


పూజలో పాల్గొన్న నిర్వాహకులు

సంతనూతలపాడు: మండల కేంద్రంలోని ముద్రగడ్డ బజార్ శ్రీ షిరిడి సాయి మందిరంలో గురువారం 24వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. మట్టా రాధాకృష్ణమూర్తి, ధనలక్ష్మి దంపతులుచే ప్రతిష్ఠించిన సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు ప్రతి ఏడాది నిర్వాహకులు ఘనంగా వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నారు. అర్చకులు వావిలాల వెంకట సుబ్రహ్మణ్య శర్మ, వి. నాగ సాయి కృష్ణ శర్మ, డి. కృష్ణమోహన్ శర్మ, డి. చైతన్య శర్మ ఆధ్వర్యంలో హోమాలు, గణపతి పూజ, అభిషేకాలు, తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. పారిశ్రామికవేత్త మట్టా వెంకట మురళీకృష్ణ, రాధా కుమారి దంపతులు, రేపల్లెకు చెందిన బొలి శెట్టి సాయి వరప్రసాద్, గాయత్రి దంపతులు, మట్టా వెంకట సాయి, చందన దంపతులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణలు తొలగించాలి


రోడ్డుపై ఉన్న మురుగు చూపిస్తూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నెల్లూరు బస్టాండ్ సెంటర్‌తో పాటు ట్రంకు రోడ్డులో ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఒంగోలు నగర కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వర రావు ఆదేశించారు. ఈ మేరకు కమిషనర్ నగరంలోని 15.. 21వ డివిజన్లలో గురువారం పర్యటించారు. రెండు డివిజన్లలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఒంగోలు నగర పాలక సంస్థ అధ్వర్యంలో జరుగుతున్న వార్డుకో వారం కార్యక్రమంలో భాగంగా 21 వ డివిజన్‌లో గల కోలాస్ హోటల్ దగ్గరలో గల కాలువను పరిశీలించారు. కాలువలో ఉన్న పూడికను వెంటనే తీసివేయాలని శానిటరీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. నెల్లూరు బస్టాండ్ ఎదురుగా గల వినాయక స్వామి గుడి దగ్గర ఉన్న కాలువలో శానిటరీ వర్కర్స్ చేస్తున్న పూడిక తీత పనులను పరిశీలించి ఆ కాలువ దగ్గరలోని కల్వర్ట్ కాలువ కన్నా ఎత్తులో ఉండటం గమనించి ఆ కల్వర్ట్ ని తిరిగి నిర్మించటానికి అంచనాలు తయారుచేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. అనంతరం 15వ డివిజన్‌లోని అన్నవరప్పాడు 3వ లైన్‌లో జరుగుతున్న వార్డ్‌కో వారం కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నవరప్పాడు 3 వ లైనులో కాలువలో సరిగా పూడిక తీయనందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15వ డివిజన్ కార్పొరేటర్ గోపీతో కలిసి అన్నవరప్పాడులో పర్యటించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజు, ఆయా డివిజన్‌ల సిబ్బంది, ఏఈ పద్మజ, ఏఈ రాజశేఖర్, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సామాజిక రుగ్మత


చీమకుర్తి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు విద్యార్థులు


కొత్తపట్నం: కేజీబీవీలో బాల్య వివాహాల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న బాలకాశమ్మ

కొత్తపట్నం: బాల్య వివాహాలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని సార్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ బాలకాశమ్మ అన్నారు. బాల్య వివాహాలు పూర్తిగా నియంత్రించడంపై మోటుమాల కేజీబీవీ, రాజుపాలెం ఎంపీపీ స్కూల్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతంలో చిన్న వయస్సులోనే వివాహాలు చేసి వారి ఆరోగ్యాన్ని పాడు చేస్తున్నారని ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎక్కడైన బాల్య వివాహాలు చేసిట్లతై వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలలో చాలా మంది డ్రాపౌట్ విద్యార్థులు బయట తిరుగుతూ వారి భవిష్యత్‌ను నాశం చేసుకుంటున్నారని.. వారందరినీ పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేజీబీవీ ఎస్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్. అరుణ, రాజుపాలెం మహిళా పోలీస్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్: బాల్య వివాహ రహిత భారతదేశం అనే అంశంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వెబ్ సమావేశం జరిగింది. అనంతరం బాల్య వివాహ రహిత భారతదేశం అనే అంశంపై ప్రతిజ్ఞ చేశారు.

వాకర్స్ ఆధ్వర్యంలో వనభోజనాలు


రంగారాయుడు చెరువు కట్టపై నిర్వహించిన వన భోజనాలకు హాజరైన వాకర్స్

ఒంగోలు సబర్బన్: రంగారాయుడు చెరువు వాకర్స్ అండ్ జిమ్ మేట్స్ ఆధ్వర్యంలో గురువారం కర్తీక వన భోజనాలు నిర్వహించారు. కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకుడు పైనం మల్లిఖార్జున రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకింగ్, జిమ్ చేయటం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఒనగూరుతాయో పలువురు వైద్యులు వివరించారు. కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎక్కల తులసీరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.